గొడ్రాలనే నెపంతో వదిలిపెట్టిన అర్ధాంగిని తిరిగి పశ్చాత్తాపంతో చేరబోయి అతను పొందిన అనుభవం?

# బాటసారి

అంబుజా భూషణ్ కథ

బస్సు దిగి మట్టి బాట వెంట నడవసాగాడు బాటసారి.

తను వెళ్లాల్సిన ఊరు దూరంగా తాటి చెట్లమధ్య మసకమసగ్గా కన్పిస్తోంది సగం దూరం నడిచాడోలేదో శరీరం నిరాకరించింది కదల్లేనంటూ. కాళ్లు మారాం చేశాయి అడుగు కూడా వెయ్యలేమంటూ.

కడుపులో ప్రేగులు రొద చేయసాగాయి ఆకలాకలంటూ. బాటసారి నీర్సంగా చుట్టూ చూశాడు తినటానికేమైనా దొరుకుతుందేమోనని.

బాట ప్రక్కన తుమ్మచెట్లు మాత్రమే ఉన్నాయి. అవతల, ఇతవతల విరగబూసిన ప్రత్తి చేలు, విరగకాసిన మిరపతోటలు తప్ప తినడానికేమీ కన్పించలేదు. కాళ్లు కాస్త పైకెత్తి చూచాడు.

దూరంగా కన్నెపిల్లకాలి వెండి పట్టాలా కాలువొకటి తళుక్కున మెరిసింది. చిన్నగా అటుకేసు నడిచాడు.

కడుపుకు పట్టగలిగినన్ని నీళ్లు త్రాగి ముఖం, చేతులు కడుక్కొని కాళ్లు అలాగే నీళ్లలో వేలాడేపి వడ్డున కూర్చున్నాడు.

నీలాకాశంలో కొంగలు జారిన చుక్కల్లా మెరుస్తున్నాయి. చల్లటి గాలి మొగలి రేకుల పరిమళాన్ని పులుముకొని హాయిగా వీస్తోంది. రెల్లు పొదలు కులాసాగా కూని రాగాలు తీస్తున్నాయి.

అంతదాకా చెదిరిన నీళ్లు మళ్లీ వొకటై అద్దంలా పేరుకున్నాయి. నీటి అద్దంలో తన రూపం చూచి నవ్వుకున్నాడు బాటసారి.

నూనె ముఖం ఎరుగక అట్టలు కట్టిన జుట్టు, బాగా పెరిగిన గడ్డం. సాగిన మెడ,



చిరిగి మురికి పట్టిన బట్టలు అచ్చం పిచ్చాడిలా ఉన్నాడు.

ఈ అవతారంలో భారతి తనని గుర్తు పడుతుందా? గుర్తు పట్టినా పలకరిస్తుందా!

పలకరించటమేమిటి. వెడామడా తిట్టిపోస్తుంది. ముఖాన ఉమ్మేసి, గజ్జి కుక్కని చూసినట్లుగా చూసి ముఖానే తలుపేసుకుంటుంది.

అవనీ అంతటి అవమానం తనకి జరగాల్సిందే. తను చేసిన పాపం చిన్నదా! చితకదా! ఎంతగా ఏడ్పించాడు తనని.

భారతి తనని ఛీకొట్టినా, ఈసడించినా సరే తను కాళ్లమీద బడి క్షమాపణ అడుగుతాడు.

భారతి మనసు తనకి తెలుసు. తనంటే ప్రాణం పెడ్తుంది. అటువంటి అమృత మూర్తిని తనేం చేశాడు. అతని కళ్లనిండా నీళ్ల పొరలు. ఆ పొరల మధ్యగా గతం పురివిప్పింది.

ఆ రోజు ఇంట్లో సత్యన్నారాయణవ్రతం జరిపిస్తున్నారు. పేరంటాండ్రు ఒకరొక్కరే రాసాగారు.

పిన్నిగారూ మీ పిల్లలెక్కడో చూపెట్టండి. మా పిల్లలూ వాళ్లతో ఆడుకుంటారు. బాటసారి పక్కింటికి క్రొత్తగా వచ్చినావిడ తన ఇద్దరి పిల్లలతో వచ్చి తులశమ్మతో అన్నది.

అయ్యో పిల్లలా అంత అదృష్టం కూడా నా తల్లీ మాకు. ఆ పిల్లల కోసమే ఈ పూజలు వ్రతాలూను మూతి తిప్పింది తులశమ్మ కోడల్ని చూచి.

పువ్వులన్నీ వో పళ్లెంలో సర్దుతున్న భారతి అత్తగారి మాటలకి దెబ్బతిన్న పిట్టలా తలెత్తింది.

ఆమె కళ్ల నిండా నీళ్లు.

ఏమిటి మీ కొడుక్కి పిల్లల్లేరా!

పెళ్లయి ఏడేళ్లయినా లేరు తల్లీ. నిన్న, మొన్న పెళ్లి చేసుకున్న వాళ్లు చిటుక్కున కంటున్నారు. దేనికైనా పెట్టి పుట్టాల్లేమ్మా. రాళ్ల పూజ చేసుకొని రత్నాల నివ్వమంటే ఇస్తాడా! ఆ భగవంతుడు. ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నామో. హాయిగా మా తమ్ముడు కూతురుంది. దాన్ని చేసుకోరా అని తెగ పోరాను విన్నాడా! రక్త సంబంధం చేసుకుంటే మంచి పిల్లలు పుట్టరు వద్దుపో అని ఈ మహాతల్లిని చేసుకున్నాడు.

అత్తగారి మాటలకి గుండె కోసుకుపోతోంటే భర్తవైపు చూచింది.

అమ్మను వారించనైనా వారించకుండా కూర్చుని ఉన్నాడు.

మా వాడికి మరో పెళ్లి చేయాలనుకుంటున్నానమ్మా మీకు తెల్సిన సంబంధం ఏమన్నా ఉందా!

అత్తగారి మాటలకి మనసు చీరిపోతుంటే మరింకేం వినాల్సి వస్తుందోనని గబగబా పక్క గదిలోకి వెళ్లింది.

భారతి పూజలో కూర్చుందేగానీ మనసు స్థిమితంగా లేదు. పొగిరి పొగిరి ఏడుస్తోన్న మనసుని సముదాయించలేక సతమతమౌతోంది. పూజంతా ఐపోయాక భర్త గుండెలపై వాలి ఏడుస్తూ అన్నది. చూశారా మీ అమ్మ ఏమంటున్నదో. మీకు, మీకు మరో పెళ్లి చేస్తుందట. అంతా నా చేతిలో ఉన్నట్లుగా మాట్లాడుతోంది.

అనంగానే ఔతుందా! ఏదో పెద్దతనం చాదస్తం కొద్దీ... సర్ది చెప్పబోయాడు బాటసారి.

పెద్దతనం అంటే పెద్ద బుద్ధులు రావాలండీ. మనిషిని ముంచోపెట్టి నిలువునా చీల్చటం కాదు వెక్కిళ్లు పెడుతూ అన్నది.

తులశమ్మ రయ్యిన గాలి దుమారంలా

వచ్చి అన్నది. ఏమిటే నా పెద్దరికానికి వంక బెడుతున్నావా!

నీకేం తెలుసే నా బాధ. ఈ ముసలిగుండె నానమ్మా అని పిలిపించుకోవాలని ఎంతగా తహతహ లాడుతోందో.

నలుగురూ నా కొడుకుని చేతగానివాడిలా అనుకుంటుంటే వింటూ ఊరికే ఉండమంటావా!

అమ్మా నువ్వు కాస్త ఊరుకుందూ బాటసారి తల్లికి నచ్చ జెప్పబోయాడు.

ఎందుకురా నా నోరు ముయ్యాలని చూస్తావు. నీకు మాత్రం నాన్నా అనిపించుకోవాలని లేదూ!

దేవుడివ్వందే మనమేం చేస్తామమ్మా.

నీ మాటలు గాల్లో దీపం పెట్టినట్లున్నాయిరా! మరో పెళ్లి చేసుకో. పిల్లలెందుకు పుట్టరో చూస్తాను.

భారతి ఏడుస్తూ తన రూంలోకి వెళ్లిపోయింది.

అది జరిగిన పదిరోజులకి తులశమ్మకి దూరపు బంధువునంటూ వొకతను కూతురితో సహా వచ్చాడు.

ఆ పిల్ల పేరు సావిత్రి. పద్దెనిమిది ఏళ్లుంటాయి. అందంగా, ఆరోగ్యంతో మిసమిసలాడుతోంది.


సావిత్రి అందగత్తే కాదు మహా గడసరి కూడా.

వచ్చిన దగ్గర్నుంచీ మామయ్యా, మామయ్యా అంటూ బాటసారి చుట్టూ తిరగటం మొదలు పెట్టింది.

అతను షేవింగ్ చేసుకునేకి కూర్చుంటే మీసాలు వత్తుగానే వుండనియ్యి మామయ్యా. లేకుంటే పేడి మూతిలాగుంటుంది అని సలహాలిచ్చేది.

స్నానానికి వెళ్తుంటే టవల్ భుజాన వేసుకు వెనకే వెళ్లేది.

భారతి చేతిలో గరిటె తాక్కొని తను కొసరి కొసరి వడ్డించేది. ఆ పిల్ల చేష్టలు చూస్తుంటే భారతికి మహా మంటగా ఉంది. ఏమిటండీ ఆ పిల్ల సిగ్గా, ఎగ్గా లేకుండా



అలా ప్రవర్తిస్తుంది అని భర్త దగ్గర విసుక్కుంటే బాటసారి చిన్న పిల్లకదా! అని చప్పరించేవాడు.

సావిత్రిని అక్కడే వదిలేసి తండ్రి వెళ్లిపోయాడు.

తులశమ్మ కొడుక్కీ, సావిత్రికీ ఏకాంతం కల్పిస్తూ అక్కడెవరో బాబా వచ్చాడు. ఇక్కడెవరో స్వాముల వారొచ్చారు అంటూ కోడల్ని పూజలంటూ వ్రతాలంటూ తిప్పేది.

ఒకరోజు పిడుగు పడ్డట్టుగా చెప్పాడు బాటసారి సావిత్రిని నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.

భారతికి నోట మాట రాలేదు.

నేను.. నేనింకా బతికే ఉన్నానండీ. వణికే గొంతుతో అన్నది. నోటి నిండా కొంగు కుక్కుకొని వచ్చే దుఃఖం ఆపుకుంటూ.

నువ్వు మాతోనే ఉందువు భారతీ. పేరుకు మాత్రమే విడాకులు. అదీ ఉద్యోగం కోసం.

ఏమండీ మీకిది భావ్యంగా ఉందా? జీవితాంతం కష్టాల్లో, సుఖాల్లో పాలు పంచుకుంటానని పెళ్లినాడు ప్రమాణం చేసి ఇప్పుడు నన్నొంటరి దాన్ని చేస్తున్నారా! నా కన్యాయం చేయకండీ. కాళ్లు పట్టుకుంది.

నాకు..నాకు నాన్నా అని పిలిపించుకోవాలని ఉన్నది భారతీ.

నాకు మాత్రం తల్లినవ్వాలని లేదా! నలుగురి హేళన్ల నుంచి బైట పడాలని లేదా! దయచేసి నన్నిడిచి పెట్టకండీ. మీరే నా జీవితం, దీపం అనుకున్నాను. చేతులు జోడించింది.

అసలు వొక్కసారన్నా డాక్టరుకు చూయించుకోకుండా, పరీక్షలు చేయించుకోకుండా ! నెపమంతా నామీదే వేస్తున్నారు. వొక్కసారి ఆలోచించండి.

నాలో ఏ లోపం లేదు భారతీ. సావిత్రి ఇప్పుడు గర్భవతి. అందుకే.. అందుకే.

భారతి మరింకేం మాట్లాడలేకపోయింది.

అతను పెట్టమన్న చోట సంతకాలు పెట్టి ఎంగిలి కూడు తినటం తనికిష్టం లేదంటూ ఇంట్లోంచి బైట పడింది.

సావిత్రికి కొడుకు పుట్టాడు. వాడు పుట్టిన వాడు పుట్టిన ఆర్నెల్లకే జబ్బుచేసి తులశమ్మ చనిపోయింది.

బాబు బోసి నవ్వుల్తో, కేరింతలతో సావిత్రి సరాగాలతో కాలం తియ్యగా సాగుతోంది.

ఆ రోజు. ఆ రోజు బాటసారి తలనొప్పిగా ఉండి రోజుకన్నా ముందే ఇంటికొచ్చాడు. ఇంట్లో ఎవరెవరి గొంతులో గోలగోలగా విన్పిస్తున్నాయి.

ఏమే నన్ను కవ్వించి, రెచ్చగొట్టి, నన్ను పిచ్చోణ్ణి చేసి నేను జైలు వెళ్లంగానే మరొకడ్ని తగులుకున్నావా!

విన్ను ఊరికే వదల్ను. పాతికేళ్ల యువకుడు నిప్పులు కక్కే కళ్లతో సావిత్రి జుట్టు పట్టుకున్నాడు.

సావిత్రి తండ్రి అతగాడి చేతుల్లోంచి సావిత్రిని విడిపిస్తూ బతిమాలుకొంటున్నాడు.

ఏం చేయం బాబూ. నువ్వా జైలుకి

పోతివి. అసలు నిన్నే ఊర్లో ఉంచారో ఎప్పుడు బైట కొస్తావో కూడా తెలియకపో యె. పైగా ఇదా గర్భవతి. నలుగురూ ఆడిపోసుకుంటుంటే ఏం చెయ్యను. సరిగ్గా అప్పుడే తులశమ్మ దగ్గర్నుంచి కబురొచ్చిం ది రమ్మని.

అతడికి మంచి ఉద్యోగం. అందుకే ముడిపెట్టేశా.

బాటసారి నెత్తిమీద పిడుగులు పడుతు న్నట్లుగా ఉన్నది.

ఈ పిల్లాడు తన పిల్లాడు కాదా? తన రక్తం కాదా!

సావిత్రి తన సొంతం కాదా! అయ్యో భగవంతుడా! భారతీ నీకెంత అన్యాయం చేశాను. నీ ఉసురే నాకు కొట్టుకుంది. నాకు మంచి శాస్తే జరిగింది. భారతీ ఎక్కడున్నా వ్ నువ్వు. అసలు బతికే ఉన్నావా! పిచ్చాడిలా రోడ్డున పడ్డాడు. తిండి లేదు. తిప్పలు లేవు. నీళ్లు లేవు. నిప్పుల్లేవు. ఊర్లు దాటి, ఏర్లుదాటి తిరిగాడు.. తిరిగాడు మనశ్శాంతి కోసం. ఆపై భారతి కోసం.

ఆఖరికెవరో చెప్పారు పలానా ఊరులో ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోందని, రెక్క లు కట్టుకు వచ్చాడు.

తను భారతి దగ్గరకు వెళ్తాడు. కాళ్ల మీదపడి క్షమాపణ కోరుతాడు. ఇక నుంచి తమనే వికారమూ దూరం చేయలేదు. తమ మధ్య ఏ భూతమూ ప్రవేశించదు. తమకే పిల్లలూ వద్దు. తనకి భారతి, భారతికి తాను అంతే.

క్రొత్త ఉత్సాహం పుంజుకోగా లేచి ఊరివైపు కదిలాడు.

ఇంటి ముందు మొక్కలకి నీళ్లు పడుతో ంది భారతి. మునుపటి కన్నా కాస్త లావై తెల్లబడింది.

వాలుజడ బదులు మెడమీద ముడి చుట్టుకుంది.

ఉద్వేగం, ఉత్సాహం, ఆనందం ముప్పిరి గొనగా ఆర్తిగా పిలిచాడు భారతీ!

ఉలికిపాటుగా తలెత్తింది భారతి.

అంతలో వారిద్దరికీ మధ్యగా వో స్కూ టర్ వచ్చి ఆగింది. దానిమీదనుంచి ఠీవిగా దిగాడో వ్యక్తి, వెనకే చిన్నపాప.

మమ్మీ, మమ్మీ డాడీ చూడు నాకెన్ని బొమ్మలు కొనిపెట్టాడో భారతి కుచ్చిళ్లు లాగుతూ ఆనందంగా చెబుతోందా పాప వచ్చీరాని మాటలతో.

భారతీ ఎవరతను. బాటసారి వంక గుచ్చి చూస్తూ అడిగాడతను.

అతను, అతను బాటసారండీ.

భుజాలెగురవేసి చిన్నగా నవ్వుకుంటూ వెనుతిరిగాడు బాటసారి.

*

